
# * కండక్టర్ కీచక్‌రావు *

కండక్టర్ కీచక్‌రావు డ్యూటీకి బయలుదేరాడు.

"నేను వెళ్లొస్తానేవ్... వీత్తలుపేస్కో..." భార్యకి చెప్పి ఓసారి పిర్రమీద చిన్నదెబ్బేసి వీధిలో పడ్డాడు. నాలుగడుగులు వేశాడోలేదో అతనికి ఇద్దరు వయసులో ఉన్న అమ్మాయిలు ఎదురుపడ్డారు. వాళ్లని దాటుకుని వెళ్లేటప్పుడు కీచక్‌రావు అతి లాఘవంగా వాళ్లపక్కనుండి వెళ్తూ సర్రున ఒకమ్మాయికి ఒళ్లు రుద్దుకుని హుషారుగా ముందుకు అడుగులు వేశాడు.




ఆ ఒళ్ళు రుద్దించుకున్న అమ్మాయికి ఒళ్లు మండిపోయి "యూ..." అంటూ కాలికున్న చెప్పు లేపింది. పక్కనున్న అమ్మాయి తన స్నేహితురాలిని వారించింది.

"ఏమిటే నువ్వు చేస్తుంది?... అతనెవరనుకున్నావ్?" అంది.

"ఏం?...ఈ ఏరియా అంతటికి గొప్ప రౌడీయా?" చెప్పు తీసినమ్మాయ్ భయం భయంగా అడిగింది. మొదటి అమ్మాయ్ ఫక్కున నవ్వింది.

"నీ భయం మండిపోనూ... అతను రౌడీకాదు... రాజకీయ నాయకుడు అంతకంటే కాదు... అతను ఆర్టీసి కండక్టర్...పాపం... సిటీ బస్సులో ఆడాళ్లని రాస్కుంటూ వెళ్లడం వాళ్లకి అలవాటు కదా... అందుకని నిన్ను అట్లా రాస్కుంటూపోయాడు..."

అది విన్న రెండో అమ్మాయి కాలికి చెప్పు తొడిగేస్కుని కిలకిలా నవ్వింది. "ఆర్టీసీ కండక్టర్... అలా చెప్పు. పాపం అలవాటు కొద్దీ అలా చేసి ఉంటాడ్లే..." క్షమించేస్తూ అంది. ఆ ఇద్దరు అమ్మాయిలూ ముందుకు కదిలారు. కీచక్‌రావు అప్పటికే చాలా ముందుకు వెళ్లిపోయాడు. అతనికి వాళ్లిద్దరి మధ్య జరిగిన సంభాషణ గురించి తెలీనే తెలీదు... ఆ రాస్కుంటూ పోవడం ఏమిటో... తన హుషారేంటో.. . తన లోకం ఏమిటో తనదే... కీచక్‌రావు ఆర్టీసీ బస్ డిపోవైపు అడుగులు వేశాడు.

* * *

"రైట్..." గట్టిగా కేకవేశాడు కీచక్‌రావు. బస్సు ఒక్క కుదుపు ఇచ్చి, నిల్చున్న వాళ్లనంతా కిందికి పడేసి ముందుకు కదిలింది. ఆ కుదుపుకి కూర్చున్నవాళ్ల నొసళ్లు ముందు సీటు కమ్మీలకు కొట్టుకుని రపరపా శబ్దం వచ్చి డ్రైవర్ చెవులకు ఇంపుగా తోచింది.

"టిక్కెట్... టిక్కెట్.." కీచక్‌రావ్ ముందుకు కదిలాడు. అందరూ డబ్బులు ఇస్తుంటే కీచక్‌రావ్ తిరిగి వాళ్ల చేతిలో పావలానో, పదిపైసలో, అయిదు పైసలో ఇలా తనకి తోచింది పెట్టి మిగిలిన డబ్బులు భుజానికి తగిలించుకుని ఉన్న తోలు సంచిలో వేస్కుంటున్నాడు.

కీచక్‌రావు కంటికి కాస్త బాగున్న అమ్మాయి కనిపించింది. అంతే... ఆ పక్కనుండి ఈ పక్కకి వచ్చేసి ఆ అమ్మాయి ఒంటికేసి తన ఒంటిని పరపరా రుద్ది ఆ తర్వాత ఆ అమ్మాయి మొహంలో మొహం పెట్టి "టిక్కెట్... హిహి... టిక్కెట్" అన్నాడు.

ఆ అమ్మాయి లోలోపల తిట్టుకుంటూ కండక్టర్‌కి రూపాయి నోటు అందిస్తూ "హిమాయత్‌నగర్" అంది.

కండక్టర్ ఆమె చేతిలోని రూపాయి నోటుని అందుకోడాని కోసం ఆమె మోచేతి దగ్గర పట్టుకుని అక్కడినుండి తన చేతిని మెల్లగా అరచేయిదాకా జార్చి ఆ తర్వాత నోటు అందుకుని ఆమెకి టిక్కెట్ ఇచ్చాడు. తర్వత ఓ వెకిలి నవ్వు ఆ అమ్మాయి మొహాన పారేసి ఆ అమ్మాయి పక్కనున్న అతన్ని "టిక్కెట్" అని అడిగాడు. అతను కీచక్‌రావుకి డబ్బులిచ్చి తాను ఎక్కడికి వెళ్లాలో చెప్పాడు.

కీచక్‌రావు అతని చేతిలో పావలా పెట్టి మిగతా చిల్లర బ్యాగ్‌లో వేస్కుని ముందుకు కదలబోయాడు.

"టిక్కెట్ ఇవ్వలేదేం?.."కండక్టర్ కీచక్‌రావుని ఆపి అడిగాడు అతను.

"టిక్కెట్టా... పావలా ఇచ్చాగా?" క్రూరంగా చూస్తూ అన్నాడు కీచక్‌రావు.

"నాకు నీ పావలా ఏం అక్కర్లేదు... నాకు టిక్కెట్టు ఇవ్వు..." అతను కూడా కోపంగా అన్నాడు, కీచక్‌రావు చేతిలో అతను ఇచ్చిన పావలాని పెట్టేస్తూ.

"అర్రె... నీవు వెళ్ళేచోటికి చేరేది ముఖ్యమా టిక్కెట్ ముఖ్యమా?" గట్టిగా అరిచాడు కీచక్‌రావు.

"రెండూ ముఖ్యమే" అన్నాడతను.

నేను ఇప్పుడే ఈ అమ్మాయికి టిక్కెట్ ఇచ్చా... అంటే ఇంకో పదిమందికి టిక్కెట్ ఇవ్వను. మళ్ళీ ఒక టిక్కెట్ ఇచ్చిన తర్వాత పదిమందికి టిక్కెట్లివ్వను. అందుకని నీకు టిక్కెట్ ఇవ్వను... ఏం చేస్తావో చేస్కో..." అని అడుగు ముందుకు వేయబోయాడు కండక్టర్ కీచక్‌రావు.

కండక్టర్ ముందుకు పోకుండా చెయ్యి అడ్డుపెట్టాడు అతను. "నువ్వు టిక్కెట్ ఇచ్చి తీరాల్సిందే!" అన్నాడు.

కీచక్‌రావుకి చెప్పలేనంత ఇరిటేషన్ పుట్టింది. వెంటనే బస్సు బెల్ కొట్టి "అర్రెయ్ రాముడూ... బస్సాప్రాబయ్" అంటూ గట్టిగా అరిచాడు. డ్రైవర్ రాముడు రోడ్డు మధ్యలో ట్రాఫిక్‌కి అడ్డంగా బస్సాపేశాడు. కండక్టర్ బస్సు దిగేసి, ఫుట్‌పాత్ మీద నిలబడి అటూ ఇటూ దిక్కులు చూడసాగాడు. అప్పుడే అటుగా ఒక స్కూటరిస్టు, సైకిలు వాడు అడ్డొస్తే వాడిని తప్పించడానికి రోడ్డు మధ్యగా గీసిన ట్రాఫిక్ లైనుకి ఒక సెంటీమీటర్ ఇవతలగా వస్తే ట్రాఫిక్ పోలీసు అతన్ని పట్టేస్కున్నాడు.

"రాంగ్ సైడొస్తున్నావ్... చలాన్ కట్టు..." అన్నాడు స్కూటరిస్టుని బరబరా ప్రక్కకి లాక్కెళ్ళిపోతూ.

"అదేంటయ్యా అలా పట్టుకుంటావ్? సైకిలిస్టు అడ్డొస్తే తప్పించడానికి కాస్త ఇటొచ్చా... అయినా వెంటనే అటెళ్ళిపోయాను కదా?" మొత్తుకున్నాడు స్కూటరిస్టు.

"అదంతా నాకు తెలీదు... సైకిలోడు అడ్డొస్తే అది వాడి తప్పు... వాడికి స్కూటర్ గుద్దించేసి నువ్వెళ్ళిపోవాల్సింది... అంతేకానీ రాంగ్ సైడ్ ఎందుకొచ్చావ్? కట్టు ఇరవై అయిదు రూపాయలు చలాన్."

అప్పుడు ఆ స్కూటరిస్టు దృష్టి రోడ్డు మధ్యలో నిలబడి ఉన్న బస్సుమీద పడింది.

"నేను లైనుకి కాస్త ఇవతల వచ్చి మళ్లీ సెకనులోపల అవతలకి వెళ్ళిపోయినా నన్ను పట్టుకున్నారే... మరి ఆ బస్సు రోడ్డు మధ్య ట్రాఫిక్ అలా అడ్డంగా ఉన్నా మీ ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోరేం?" తెలివిగా ప్రశ్నించాడు స్కూటరిస్టు

"ఏం ఎక్కువ తక్కువ మాట్లాడుతున్నావ్?... మేం ఆర్టీసి బస్సులుగానీ, గేదెలూ, ఆవులూ, దున్నపోతులూ, ఎద్దులుగానీ రోడ్డు మధ్య నిల్చుంటే పట్టించుకోనే పట్టించుకోం... ఆర్టీసి బస్సులు రాంగ్ సైడ్ వెళ్ళినా, ఓవర్ స్పీడు వెళ్ళినా, ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర రెడ్ లైట్ పడినప్పుడు ఆగకుండా వెళ్ళినా పట్టించుకోం... అది మా ఇష్టం... అడగడానికి నువ్వెవరు? ... ఛల్ ... ఇరవై అయిదు రూపాయలు చలాన్ కట్టు..." స్కూటరిస్టు కాలర్ పట్టుకుని అడిగాడు కానిస్టేబుల్.

"చలాన్ కట్టక తప్పదా?" దీనంగా అడిగాడు స్కూటరిస్టు.

"ఎక్కువ మాట్లాడితే యాభైరూపాయలు కట్టాల్సి వస్తుంది.... ఆ... లేకపోతే నా జేబుకి పదిరూపాయలు కట్టు... వదిలేస్తా... హిహి..."

స్కూటరిస్టు కానిస్టేబులుకు పదిరూపాయలు ఇచ్చి "హమ్మయ్య" అనుకుంటూ అక్కడినుండి బయటపడ్డాడు.

ఇక్కడ... సిటీ బస్సులో పెద్ద గొడవ జరుగుతూ ఉంది. టిక్కెట్ ఇవ్వాల్సిందే అని కండక్టర్‌తో గొడవ పెట్టుకున్న అతన్ని అందరూ తల వాచేలా చివాట్లు పెట్టారు.

బస్సులోని ఒకబ్బాయ్ "అమ్మోయ్ ... అమ్మోయ్ ... ఆయన తల్పొచ్చాడు... ఎంత లావుందో... హి... హిహి. .." అని నవ్వేసరికి అతనికి భయం పట్టుకుంది. అతను బస్సులోని జనం అందరికీ ఓసారి చేతులెత్తి దణ్ణం పెట్టి "ఇంక నన్ను తిట్టకండి బాబూ ..." అని బస్సు దిగి కండక్టర్ కీచక్‌రావుకి సారీ చెప్పి, ఇంక జీవితంలో ఏ కండక్టర్‌నీ టిక్కెట్ అడగనని ఒట్టేసి కీచక్‌రావుని బస్సులోనికి తీస్కొచ్చాడు.

"రఫ్హాయిట్.." బెల్ కొడ్తూ కీచక్‌రావు గట్టిగా రంకెవేశాడు. బస్సు వయొలెంట్‌గా ఒక్క కుదుపు ఇచ్చి ముందుకు దూకింది.

మళ్ళీ బస్సులో నిలబడ్డ జనం మొత్తం మొదట వెనక్కి విరుచుకుని... ఆ తర్వాత రెండు కాళ్లూ పైకెగరేసి కిందపడ్డారు. ఆ తర్వాత విసుక్కుంటూ లేచి బట్టలకంటిన దుమ్ము దులుపుకున్నారు. కూర్చున్న

వాళ్లు మాత్రం ముక్కుతూ మూల్గుతూ నొసళ్లు రుద్దుకున్నారు.
కండక్టర్ కీచక్‌రావు బస్సులో అటూ ఇటూ తిరుగుతూ వీలుకుదిరిన ఆడవాళ్లందరికీ ఒంటిని రాస్కుంటూ తిరుగుతున్నాడు.
ఒకమ్మాయికి మాత్రం కాస్త అతిగా తన ఒంటిని రుద్ది ఆ తర్వాత ఆమె పిర్రమీద గట్టిగా గిల్లేశాడు.
"ఏం?... కొవ్వెక్కిందా?..." అంటూ అరిచింది మండిపడ్డ ఆ అమ్మాయి.
"అర్రె ఇస్కీ... బస్సులో రష్‌గా ఉంటే తగలకుండా పోవాలంటే ఎట్లా... అంత సుఖంగా పోవాలంటే ఆటోలో పోమ్మా... అర్రేయ్ రాముడూ, బస్సాప్రా బయ్ ..." గట్టిగా అరిచాడు కండక్టర్ కీచక్‌రావు.
డ్రైవర్ రాముడు ఠక్కున సడెన్ బ్రేకు వేసి బస్సాపివేశాడు. అంతే... నిల్చున్న వాళ్లంతా ధడేలున కిందపడి తర్వాత లేచి నిలబడి కండక్టర్‌కి కోపం తెప్పించిన ఆ అమ్మాయిని తల వాచేలా చివాట్లు పెట్టసాగారు.
... కండక్టర్‌కి ఇరిటేషన్ కలిగించినందుకు... ఆ అమ్మాయి పకపకా నవ్వింది.
"తిట్టండి... ఇంకా బాగా తిట్టండి... నాకే మంచిదోచ్... అసలే మా ఆయన నాతో అంటుంటాడు నా బుర్రకాయ పీచు తీసిన కొబ్బరి కాయ్‌లా చిన్నదిగా ఉంటుందని... మీరిట్టా తల వాచేలా తిడ్తే నాకే లక్కీ. .. హిహిహి... నేనెంత లక్కీనో... హి.." అంది సంబరంగా చప్పట్లు కొడ్తూ.
"చాల్లేవమ్మా... ఇప్పుడు నీ తలకాయ్ ఎట్టా ఉందో చూస్కో... కల్లు కుండలా వాచిపోయింది..." బుగ్గలు నొక్కుకుంటూ అంది ఓ ముసలావిడ.
ఆ అమ్మాయి నాలుక కొరుక్కుని చెంపలేస్కుని కండక్టర్‌కి సారీ చెప్పింది. బస్సు మళ్లీ బయలుదేరింది. కాస్సేపయ్యాక కండక్టర్‌కి మరో చిలిపి ఊహ కలిగింది పాసింజర్లనందర్నీ ఒక్కసారిగా ఏడిపిస్తేనో?
అంతే... "ఒర్రేయ్ రాముడూ ... బస్సాప్రా బయ్... నేను అందర్కీ టిక్కెట్లు ఇష్యూ చెయ్యాలి!" అని అరిచాడు.
బస్సాగిపోయింది .... దాదాపు ఇరవై నిమిషాలు. కండక్టర్ కీచక్‌రావు తృప్తిగా నిట్టూర్చాడు.

* * *